# మొక్కుబడి

[ చిన్నకథ ]

= శ్రీ చాగంటి సోమయాజులు =

"ఈ పొద్దు గోడపని ఐపోతాది. ఇయేళ పీడరు బాబు డబ్బు ఇచ్చేస్తారు" అని మధ్యాహ్నం అంబలి తాగుతూ పైడితల్లి పెళ్లాంతో చెప్పేడు.

ప్లీడరుగారి దొడ్డిగోడ కంట్రాక్టుగా కట్టడానికి పైడితల్లి ఒప్పుకున్నాడు. చెప్పుకో తగ్గ పనివాడు. అవలీలగా పని పూర్తిచేశాడు. మేస్త్రీలకీ, కూలీలకీ పోను పదిపదహేను రూపాయలు మిగులుతాయి.

డబ్బు అందుతుం దనగానే అంకి మొహం విప్పారింది. వాళ్ల గుడిసె ఎప్పుడూ పూటభత్యం, పుల్లవెలుగూ, అలాగ కాకుండా ఈమారు పదిరూపాయిల సొమ్ము ఒక్కసారి చేతిలో పడుతుంది. అంకికి ఊహాలు, ఉద్దేశాలూ ఎన్నెనా ఉన్నాయి.

అంకి ఆలోచించింది. సంసారానికి కావలసినవి ఎన్నో ఉన్నాయి. మంచినీళ్ల కడవ కొనాలి. అమ్మవారి పండుక్కి నలుగురు చుట్టాలొస్తే ఆటొచ్చే దాకలు కొనాలి. చలికాలం కప్పుకోడానికి పచ్చడం కొనాలి. పిల్లడికి మాయవెండిసరుకులు కొనాలి. ఇంకెన్నో ఆలోచించింది. ఆఖరుకి "ఈపాలి కొండెక్కాలి" అని మొగుడితో చెప్పింది.

"కోయిటోడి బాకీ పదిరూపాయిలు ఆడి కియ్యకపోతే ఆడు పిలక జాడిస్తాడు" అన్నాడు పైడితల్లి.

"కోయిటోడి బాకీ రెండురూపాయిలే. ఎనాగైనా తీర్సొచ్చు."

"పదిరూపాయిలని నువ్వే సెప్పినావు!"

"ఔను, పదిరూపాయిలే. మొన్న మాయమ్మొచ్చి ఎనిమిది రూపాయిలు సేతులెట్టింది. కోక కొనుక్కోయే అంది. కోయిటోడి కిచ్చీసినాను."

"నాకు సెప్పకుండా ఆడి కెందు కిచ్చీసినావు?"

"ఆ దక్షమైన మాటలూ అంటే వొళ్లు మండి ఇచ్చీసినాను".

"నాతో సెప్పవలసింది."

"ఎందుకూ?"

"నాను సారావోడికి రెండురూపాయిలు బాకీ."

"ఆమాట సెప్పితే ఇవ్వకపోదునా! ఓలమ్మకొడక, ఏటో అనుకొన్నాను. ఇంకా కోక తెద్దు నంటా డనుకొన్నాను! సారా వోడికా! మాపుట్టింటో రిచ్చిందీ తాగీదా మనుకొన్నావా?"

"తాకూ్కడ దేటి?"

"తాగుదువుగాని. ఈపాలి కొండెక్కాలి. ఎర్రులకి పోకు" అన్నాది.

పైడితల్లిగణింపు మంచిదే. రోజుకి ఒకటిరెండు రూపాయిలు తెస్తాడు. కాని తాగేస్తాడు. అతనికి కల్లు తాగడం తప్పని సరి. సారా తాగడం గొప్ప. తాగగా మిగిలిన డబ్బులు పెళ్లాంకి సంసారంకింద ఖర్చుపెట్టమని ఇచ్చేస్తాడు. అంకి సంసారాన్ని పొదుపుచేసి, వెయ్యి కూడికలు చేసి అందు లోనే మొగుడికి తెలియకుండా పావలా, బేడా వెనకేసి డబ్బు చేస్తుంది. పుట్టింటిపేరు చెప్పి సమయాసమయాల్లో సంసారానికే ఖర్చు పెడుతుంది. ఆ బాపతుడబ్బుతో కోమటిబాకీ తీర్చేసింది.

"ఇంకా అంబలి కాలేదురా?" అంటూ అసిరిగాడు లోపల కొచ్చాడు.

"ఓ రుండ్రవ వొస్తాను" అన్నాడు పైడి తల్లి. ఉన్న అంబలంతా జుర్రేసి గట్టిగా తేన్చి లేచాడు.

గుడ్డ ఉయ్యాల్లో వెచ్చగా పడుకొని నిద్రపోతున్న పిల్లడు "ఎఁఏఁ" అంటూ లేచాడు. అసిరిగాడు ఉయ్యాల్లోంచి నల్ల గుమ్మిడికాయలాంటి పిల్లణ్ణి తీసి ఎత్తు కున్నాడు. పిల్లడు కిరకిర కొట్టుకుంటూ గుక్కపెట్టి ఏడ్చాడు.

"ఆరే చిమాద్దిరీ, నాకాడికి రావా?" అంటూ పెద్దచప్పుడుతో అసిరిగాడు ముద్దెట్టు కున్నాడు.

"ఓ రసిరిగ, కురుపు రేపేసినావురా. ఇలా తే పిల్లాణ్ణి" అని అందుకుంది అంకి.

"కురు పెక్కడ?" అన్నాడు అసిరి గాడు.

"మొన్న నొద్దంటూ ఉంటే ఇనస పెట్టరు టీకాలు పొడిచీసినాడు. జొర మీ పొద్దే తగ్గినాది. రాత్రిళ్లు బాధబాధ సచ్చి పోతున్నాము."

అసిరిగాడు టీకాలు చూశాడు.

"ఇంకా మొగ్గరంగా ఉన్నాయి. పసు పెట్టు. మావోడికి నిరుడావిటికి టీకా లేయించినాము" అన్నాడు.

"ఔనుగాని అసిరిగా, మొన్న సొపన మొచ్చింది.. అదెవరో అట. ఎందుకొచ్చి నావు కావు అనడిగినాడు. తెలివొచ్చి పరకాయించి చూస్తే ఏటీ నేదు. గుండె జల్లుమంది. మావోళ్ల నడిగితే చిమాద్ది రప్పన్న అన్నారు. అదేటో నీకు తెలుసా?"

"మొక్కుకున్నారేటి?"

"కుర్రాడికి బాగునేకపోతే మొక్కు కున్నాము కాదా?"

"ఐతే ఇకనేం? ఎల్లండి ఎంటనే. దేముడి తో పరాచికాలు కావు. ఈపొద్దు పైడితల్లి పదేను రూపాయిలు పుచ్చుకొంటాడు"

పైడితల్లి పొగాకుబొండాం విప్పి చుట్టలు చుట్టుకొంటున్నాడు.

"నీకేం కబుర్లు సెపతావు. ఆరు రూపా యిలు ఖరుసవుతుంది. ఎట్టుకోవొద్దా?" అన్నాడు పైడితల్లి.

"పదేను రూపాయిలొస్తే ఆరురూపాయి లెట్టుకోలేవా?" అన్నాడు అసిరిగాడు.

"అంతా అగ్గిమీద గుగ్గిలమేసేవోళ్లే. అది మొక్కుకోడ మెలాగుందో నువ్వ ఎళ్లమండ మలాగుంది." అన్నాడు పైడితల్లి.

"లెంపలోయించుకో! దేముడితో పరాచికాలు కాదు" అన్నాది అంకి.

"లెంపలోయించుకోనా? ఇదిగో వో యించుకున్నాను. సరా? పిల్లడికేటీ నేదురా. రెండు తుమ్ములు తుమ్మినాడు. సరి మొక్కీసింది. ఇనాగైతే ఎవడి తరం? దేముడితో పని. తప్ప దెల్లాలి." అన్నాడు పైడితల్లి.

గుఱ్ఱెడుతూ అంకి గుండెలమీద పిల్లడు నిద్దరపోయాడు.

"నిద్దరొచ్చిందా? అమ్మా, నీకు నిద్దరొచ్చిందా? మా బాబు రేపు చిమాచెలం ఎళతారేటి? కొండ ఎక్కుతారేటి? అబ్బో అబ్బో! ఈ బాబు రెయ్యిలుబండి ఎక్కుతారా? రెయ్యిలుబండి ఝుఘ్ఝుప్" అంటూ పిల్లణ్ణి మళ్లా అంకి ఉయ్యాల్లో పడుకోపెట్టింది.

చుట్టలు చుట్టుకుని పైడితల్లి లేచి చూరుమీది తాపీ తీశాడు. అసిరిగాడు చెవులో చుట్ట తీసి నోట్లో పెట్టి జేబులో అగ్గిపెట్టి తీశాడు.

"మామా చూడు. అసిరిగోడు అగ్గిపెట్టి తీసినాడు" అన్నాది అంకి.

అసిరిగాడు పుల్ల తీసి వెలిగించబోయాడు.

"ఎలిగించ కుండు. కుంపట్లో అగ్గిని వ్వుండగా అగ్గిపెట్టె తీసినాడు! ఊరకొచ్చిందిరా అగ్గిపెట్టి? కొంపలినాగే కూలిపోడం" అని కుంపట్లోంచి అగ్గితోర తీసిఇచ్చింది.

"అంకీ, శ్రేతికి సేప లొట్టుకురా" అన్నాడు పైడితల్లి.

"ఇయేళ సేపలు కొనాలా? నావొల్ల కాదు బాబూ ఈసంసారం. నిన్న పావలా డబ్బులిచ్చినావు. బియ్యమేటి తెమ్మన్నావు? కూరేటి తెమ్మన్నావు? ఈపొద్దు సేప లెక్కణ్ణుంచి తెమ్మన్నావు?" అంది అంకి.

"ఓ లెవడికాడేనా ఉచ్చుకోయే" అన్నాడు పైడితల్లి.

"ఉచ్చుకోనా? అప్పుచేసి కొప్పునవరం. ఈపొద్దు గోగాకుపులుసుకి గతి నేదు"

"సందవేళ నానే బజారు కెల్లి సవల్లు తెస్తాను"

"నువ్వేటీ తేవొద్దు. డబ్బంతా నాసేతు లెట్టకపో నీపని సెపతాను. సవల్లూ తెస్తావు, వొంజిరంముక్కలూ తెస్తావు!"

మేస్త్రీలు వెళ్లిపోయారు. తాపీగా రెండుగంటలు కూచుని అంబలి తిని అంకి పడుకుంది. లేచేసరికి సూర్యుడు వాలిపోయాడు. రోడ్లనిండా వసంతంలాగ ఎండ వాలికింది. బియ్యపుచీటీ తీసి, బుట్ట తీసి, చంకలో పిల్లాణ్ణేసుకుని బజారుకి వెళ్లింది. ఉప్పుగర్ర, మిరపకాయ, చేపా జెల్లా కొంది. కాణీ కొబ్బరుండ కొని తింటూ చిన్నముక్క పిల్లడికి పెడుతూ గుడిసె కొచ్చింది.

చీకటి పడ్డాది. పిల్లడు కేకలు పెడుతూ గుడిసంతా బగురు తున్నాడు. అంకి అరికాల్లో దురదేసింది.

"బాబూ, మనం చిమాచెలం ఎళతాము" అని కొడుకుతో చెప్పింది. కొడుకు జోసినప్పు నవ్వేడు. అంకిఅరిచెయ్యి దురదేసింది.

"బాబూ, నా అరిసెయ్యి దురదేస్తున్నాది. మీయయ్య డబ్బు తెస్తాడు. నాసేతులో డబ్బు పడతాది. కొండెక్కుతాము.

ఏం?"అని కొడుకు నడిగింది. కొడుకుబోసి నవ్వు గుడిసంతా మతాబాలాగ వెలిగింది.

అంకి పొయ్యంటించి చేపలకూర మొగుడికి హితవయినట్టు వొండింది. వంట పూర్తి కాగానే కాళ్లూ చేతులూ కడుక్కుని, కొప్పు సవరించుకొని, మొగుడు ఎప్పుడు వస్తాడు ఎప్పుడు వస్తాడని చూస్తూ అరుగు మీద కూచుంది వాసకసజ్జిక.

ఎంతరాత్రయినా పైడితల్లి ఇల్లు చేరలేదు. అసిరిగాడు తప్పతాగి తందనాలు తొక్కుతూ వీథిలో కొచ్చాడు.

"అంకీ, పైడితల్లీ మేమూ తాగీసినాము. చిమాద్రిరప్పన్న మొక్కు సారాకొట్లో తీర్చిసినాము."అని చెప్పేడు.

"ఓలమ్మ తాగీసినావే!" అని అంకి గుడ్లలో నీరు నింపుకొంది.

అసిరిగాడికీ, బండిరామయ్యకీ పెద్దజట్టీ అయిపోయింది. అసిరిగాడు రామయ్యకి ఆరణాలు బాకీ. వాడు బాకీడబ్బు లడిగేడు. నే నివ్వను నీతాతతో చెప్పుకో అన్నాడు అసిరిగాడు.

అసిరిగాడు తాగి పిచ్చెత్తిఉన్నాడు. రామయ్యా తాగుడు లేకే పిచ్చెత్తి ఉన్నాడు. ఇద్దరూ జుత్తులు పట్టుకొని కలబడ్డారు. వీథివాళ్లంతా విడిపించారు. అసిరిగాడి పెళ్లాం కణికి లబోలబోమని, నెత్తినోరూ కొట్టుకుంటూ వొచ్చింది.

"వొగ్గండి నన్ను. ఇయేళ ఆడో నేనో కడతేరిపోవాలి"అని గింజుకుంటున్నాడు రామయ్య. కణికికి సంసారం దుర్భరమైపోయింది.

"ఇదేనా నీవాళకం? ఇంట్లో ఏటీ నేదు. మూణ్ణాళ్లయి ఏటి తింటున్నామో, పేణాలతో ఎనాగ నిలబడిఉన్నామో బగమంతుడికెరుక. మొన్న తాగీసినాడు. నిన్న తాగీసినాడు. ఈపొద్దు తాగీసినాడు. ఈడి బుర్ర పడిపోను."అంటూ కణికి ప్రారంభించింది.

పట్టుకున్న వాళ్లని ఒక్క దుళుపుతో విడిపించుకొని అసిరిగాడు పెళ్లాంమీద పడి దాన్ని దబడదబడ చితకతన్నడం ప్రారంభించాడు.

"అంకీ!" అని గట్టిగా ఆబోతుఅంకె వేస్తూ పైడితల్లి వచ్చేడు.

"అంకీ, పదేనురూపాయి లొచ్చినాయి. రెండు మల్లుచొక్కాలు కుట్టించినాను. ఒక పంచ కొన్నాను. తరవాత తాగీసినాము. అసిరిగోడు, వెంకటరామయ్య, పొట్టిఎదవ, దాలిగోడు, సిన్నోడు కలిసి తాగీసినాము. హిహ్విహ్వి!"అని నవ్వేడు.

"పోన్నే!"అంది అంకి.

"డబ్బుకేటి నే. ఎదవడబ్బు. నలుగురు తాగినాం."

"ఆళ్లందరికీకూడా ఎడితే మన దినం ఎళతాదా ?"

"నీకేటో అంకీ! నువ్వు మేస్త్రీపెళ్లాంవి. మనం నాలుగురోజులు కష్టపడితే నెల్లాళ్లకూడు" అని అంకిముక్కు పట్టుకున్నాడు.

"చాలు సరసం, ఎళ్లు"

"ఎక్కడ కెళ్లమన్నావు? సారాముండ దగ్గిరికెళ్లమన్నావా? దాని జుట్టూ, దాని కట్టూ బలేగా ఉంటాయి. దాని పేరు మాణిక్కెం. ఛీ! నే నలాటోణ్ణి కాదు. ఎవడి నడుగుతావో అడుగు. పెళ్లాలుండగా ఎదవబుద్ధులు తప్పని అందరినీ తిడతాను."

"ఎనక కల్లు, సారాదుకాణా లెత్తేస్తా రనుకొన్నారు. ఎత్తీసినా బాగుణ్ణు." అని అనుకొంది.

"ఏటన్నావు? కల్లుపాకలు పీకేస్తారనా? నాకు తెల్దనుకొన్నావేటి? నాను పెద్దోళ్ల కాడ తిరుగుతున్నాను. ఎనక కొన్నిసోట్ల మనోళ్లే కల్లుదుకాణాలు పీకించీసినారు. ఇప్పుడు మళ్లా గవన్నమెంటోళ్లు అక్కడా కల్లు, సారా అమ్మమన్నారు. ఇదెవడి రాజ్జెం అనుకొన్నావు? మా కడ్డు నేదు. మాకేటో అంకే"

"జౌన్నే. మంచిప నీనోకంలో ఎవడూ సెయ్యడు"

"కూకుని కబుర్లు సెపతావేటి. నెగు. కూడు తినాలి"

"కడుపునిండా కూడే. నానీపా ద్దొండ నేదు"

పైడితల్లి గుడిసెలో దూరేడు. అసిరిగాడి జట్టీతో గూడెం గొల్లుమంటున్నాది. పైడితల్లి కూరకుండని పట్టుకుని బైటి కొచ్చాడు.

"సేపలకూరొండినా? వొండనన్నావు?" అన్నాడు.

"సెపలసిత్తందాన్ని. నీకు సెయ్యక పోతే ఇంకెవ్వడికి సెయ్యమన్నావు? నీ మొక్కుబడి అయినాకే అన్ని మొక్కులూ. లోపలకి నడు. కుండట్టుకుని ఈదిలో కొచ్చావు" అని లేచింది.

"అప్పన్నకొండకీ ఎప్పుడెల్లినగాని"- అని పాడుకొంటూ పైడితల్లి పిల్లిలాగ ముడుచుకుని తిండికి కూచున్నాడు.

---

# రాత్రిలో రంపకొండలు

= శ్రీ కొమరవోలు వెంకటసుబ్బారావు =

ఎన్ని యుగాలనాఁడు తమ రిచ్చటికిం దిగజాఱినారు ? మీ
కున్న వయ స్సదెంత ? తమ రూరక యోచన సేయుచున్న యా
యున్నతశంక లేమి ? తమ రొంటరిగా శయనించియుండ మీ
కన్నుమొగుడ్పు నాఁటకుఁ గల్గదుగా యొక భంగ మెన్నఁడున్?

ఏదో పెద్ద యమోఘమౌ విషయమే యేకాగ్రచిత్తమ్ములోఁ
బాదుంగొల్పినవారు! దాని సరిగాఁ బాకమ్ము జేకూరున
ట్లేదో దారికి దేనిదే పయికి మీ రేతెంచినన్ వ్యర్థమౌఁ
గాదా యిన్ని యుగాలు పడ్డశ్రమయుం గష్టమ్ములున్ నిద్రయున్ ?